క్లుప్తంగా

హైస్కూల్ సందర్శన



తరగతిలోని విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

చీమకుర్తి: జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ మోడల్ టెస్ట్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం ఉమామహేశ్వరితో పాటు స్థానిక టీచర్‌లు, డీఈఓ అడిగిన వివరాలకు సమాధానాలు చెప్పారు. డిప్యూటీ ఈఓ సామా సుబ్బారావు హాజరయ్యారు.

సమావేశం నిర్వహించండి

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామ పంచాయతీ పరిధిలో అభ్యర్థన సమావేశం నిర్వహించాలని ఆ గ్రామ వార్డు మెంబర్లు మంగళవారం ఈఓపీఆర్‌డీ రఘుబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల పంచాయతీ పరిధిలో ఉన్న పబ్లిక్ వాటర్ స్కీంకు విద్యుత్ సరఫరా నిలిపివేశారని అందువలన నీటికి ఇబ్బందులు ఎదురౌతున్నాయని తెలిపారు. దీనిపై పంచాయతీ సమావేశం ఏర్పాటు చేసి నీటి పన్ను మళ్లీ వసూలు చేసేందుకు అజెండా అంశాల్లో చర్చించి తీర్మానం చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. స్కీమ్‌లో దాదాపుగా 19 లక్షల రూపాయలు పైగా విద్యుత్ శాఖకు చెల్లించాల్సి ఉందని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నీటి పన్ను వసూలు చేసేందుకు ఒక వ్యక్తిని పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేదా పంచాయతీ కార్యదర్శి ద్వారా వసూలు చేసి ఆడబ్బు పంచాయతీకి జమ చేయాలన్నారు. వాటితో విద్యుత్ బకాయిలను చెల్లించడం, సిబ్బంది జీతభత్యాలు చెల్లించడం వంటి అంశాలు ఆమోదించుకోవాలని కోరారు. దీనికి గాను సమావేశం నిర్వహించుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై ఈనెల 30వ తేదీలోగా పంచాయతీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

'బతకనివ్వరా' పాట రికార్డింగ్



పాట రికార్డింగ్‌లో గాయకుడు శరత్, కవయిత్రి జ్యోతిర్మయి, వెస్లీ

ఒంగోలు టౌన్: దేశాన్ని కుదిపేస్తున్న జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై ఒంగోలులోని జూనియర్ డాక్టర్లు ఆందోళన బాట పట్టడం తెలిసిందే. దీనిపై దేశంలోని కవులు, కళాకారులు స్పందిస్తున్న నేపథ్యంలో ఒంగోలుకు చెందిన ప్రముఖ కవయిత్రి, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి రచించిన 'నన్ను బతకనివ్వరా' గీతాన్ని మంగళవారం రికార్డింగ్ చేశారు. ప్రజా గాయకుడు నూకతోటి శరత్ గానం చేయగా విజయవాడకు చెందిన సంగీత దర్శకుడు వెస్లీ రికార్డింగ్ స్టూడియోలో రికార్డు చేశారు. అత్యంత పాశవికంగా జూనియర్ వైద్యురాలిని రేప్ చేయడమే కాకుండా దారుణంగా హత్య చేయడం తనను కలిచివేసిందని, ఈ ఘటనతోపాటు మహిళలపై నిరంతరం జరుగుతున్న లైంగిక దాడులు, హత్యల నేపథ్యంలో ఈ గీతాన్ని రాసినట్లు కవయిత్రి జ్యోతిర్మయి తెలిపారు. ఈ దృశ్య గీతాన్ని త్వరలోనే వైద్య విద్యార్థులు, జూడా, ఐఎంఏ, ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గాయకుడు శరత్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగితీగ చోరీ

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వలో దుండగులు దుగ్గెపోగు సుగుణమ్మకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగితీగను అపహరించుకెళ్లారు. పంట పొలాలకు బోర్ల ద్వారా నీరు అందించేందుకు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కొనకనమిట్ల: జాతీయ రాహదారిపై చినారికట్ల జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం ఎస్సై మాధవరావు తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలతో మాట్లాడారు. శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నేడు పశువైద్య శిబిరం

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లిలో పశుగర్భకోశ చికిత్స శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ డి.విష్ణువర్ధన్ తెలిపారు. ఎదకు రాని, తిరగబట్టే పశువులకు మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

దామచర్ల మాటలు నీటి మూటలే!



భాగ్య నగర్‌లో మంచినీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం



భాగ్య నగర్ 4వ లైన్‌లో తీసిన గుంతలో నిలిచిన వర్షపు నీరు

- నగరంలో తాగునీటి ఎద్దడి
- కొన్ని ప్రాంతాల్లో మూడు, మరికొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఒకసారి నీటి సరఫరా
- ఏ సమయానికి కుళాయిలు వస్తాయో కూడా తెలియని పరిస్థితి
- ట్యాపుల నుంచి వస్తున్న మురుగు నీరు
- ప్రతి రోజూ మున్సిపల్ వాటర్ ఇస్తామని ఎమ్మెల్యే దామచర్ల నాడు హామీ

ఒంగోలు అర్బన్: గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రెండు రోజులకు ఒకసారి కార్పొరేషన్ తాగునీరు సక్రమం సరఫరా అయింది. అయితే ఎన్నికల అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో నగరవాసులకు నీటి కష్టాలు తప్పడంలేదు. రెండురోజుల మాట అటు ఉంచితే మూడు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరాఅయ్యే దుస్థితి నెలకొంది. దానికితోడు కాలువల్లో పూడికల తీత పేరుతో కూటమి నాయకులు కొన్ని ప్రాంతాల్లో దగ్గర ఉండి మరీ పూడికలు తీయించారు. ఆ సమయంలో తాగునీటి సరఫరా పైపులైన్‌లు పగిలాయి. దీంతో మురుగు కాలువల్లోని నీరు మంచినీటి కుళాయిల్లో కలిసిపోయి గృహాలకు చేరుతోంది. నల్లటి రంగుతో పాటు మట్టి, దుర్వాసనతో నగరవాసులు బెంబేలెత్తుతున్నారు. వీటిని తాగుతున్న వారు రోగాల బారిన పడుతున్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరా చేసే ప్రాంతాల్లోని వారి కష్టాల సంగతి సరేసరి. ఎక్కడ చూసినా పైపు లైన్లు లీక్ అవ్వడం, విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల సమస్యలు వంటివి తాగునీటి సరఫరాలకు తీవ్రమైన ఆటంకం కలిగిస్తున్నాయి. అయితే నగరపాలక అధికారులు, పాలకులు ఈ సమస్యను గాలికి వదిలేశారు. ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన దామచర్ల జనార్దన్ నగరపాలక పరిధిలో ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే గతం కంటే పరిస్థితి ఘోరంగా మారింది. ఎమ్మెల్యే దామచర్ల ఇచ్చిన మాట మేరకు నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ కార్పొరేషన్ ఎంఈ జానీ నీటి సరఫరాపై స్పందిస్తూ పైప్‌లైన్‌లు, విద్యుత్ ఉపకరణాలు వంటి వాటికి కాలం చెల్లడంతో ఒకదాని తర్వాత ఒకటి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వాటికి ముందుగా మరమ్మతులు చేసి అనంతరం నీటిని సరఫరా చేయాల్సి వస్తోందన్నారు. దీనివల్ల కొంత జాప్యం జరుగుతోందని.. ప్రధాన పైపులైన్‌ల కాలం చెల్లడం వల్ల లీకులు ఏర్పడ్డాయన్నారు. వాటికి మరమ్మతులు చేసి నీటిని వదిలితే మరో చోట లీకులు ఏర్పడుతున్నాయన్నారు. అంతేకాకుండా ఎస్ఎస్ ట్యాంకుల్లో నీరు తగ్గడం కూడా ఒక కారణమని తెలిపారు. అయితే గడిచిన నాలుగు రోజుల నుంచి సాగర్ జలాలను ఎస్ఎస్ ట్యాంకులకు నింపుతున్నామని.. వారం రోజుల తర్వాత ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



మంచినీరు లీక్ కావడంతో డ్రైనేజీ కాలువలో కలుస్తున్న నీరు



డ్రైనేజీలో మట్టితో కలిసి వస్తున్న మంచినీరు

పథకాలతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీఓ ఏపీఓ తదితరులు

మద్దిపాడు: మండలంలోని ప్రతి గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వచ్చే పథకాలను వినియోగించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో జరగబోయే పనులకు గాను గ్రామ సభ ఆమోదం కోసం ఈనెల 23వ తేదీన గ్రామ సభలు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే మంజూరు చేసిన.. పురోగతిలో ఉన్న పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శి చదవడం, కొత్తపనులపై చర్చించడం వంటివి చేయాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కొత్తపనుల కోసం ప్రతిపాదనలు తీసుకోవడం.. సోషల్ ఆడిట్ ప్రాముఖ్యత వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రామ సభ జరిపే తేదీని రెండు రోజుల ముందుగానే దండోరా వేయించాలని, ఆమోదం పొందిన తీర్మానాలను గ్రామ సభ రిజిస్టర్‌లో నమోదు చేయించాలని సూచించారు. గ్రామ సభకు వచ్చిన వారితో సంతకాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల ఉత్పాదకతను మెరుగు పరచుకోవడానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌ను ఎలా ఉపయోగించుకోవచ్చో వివరించారు. తీర్మానాలను, ఫొటోలను యాప్ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యాలయ ఏఓ సుబ్బారావు ఏపీఓ ధనుంజయ వర్మ, టెక్నికల్ ఇంజినీర్ కిషోర్‌కుమార్, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ మీటింగ్ తనిఖీ



ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇస్తున్న రమేష్

కొత్తపట్నం: తరగతి గదిలో నిర్వహించే బోధనాభ్యసన ప్రక్రియను అంచనా వేయడంలో టీచ్ టూల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సమగ్రశిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి యం.రమేష్ అన్నారు. బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న బయోలాజికల్ సైన్స్ సబ్జెక్ట్ కాంప్లెక్స్ మీటింగ్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ప్రతి పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలలను తప్పనిసరిగా వినియోగించాలని అదే విధంగా ప్రయోగశాలలో తప్పనిసిగా రికార్డ్స్ నిర్వహించాలని కోరారు. ఆగస్టు 23వ తేదీన అన్ని పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవంలో విద్యార్థులు పాల్గొనే విధంగా క్విజ్, వ్యాసరచన, పోస్టర్ తయారీ, డిబేట్, వర్క్‌షాప్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కేజీబీవీలో నిర్వహిస్తున్న సీబీఎస్సీ విధానంలో పదో తరగతి వారికి ట్యాబ్ ఆధారిత పరీక్ష పరిశీలించారు. ఎంఈవో పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్విస్ కాలేజీకి ప్రథమ స్థానం



అవార్డు అందుకుంటున్న క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు తదితరులు

ఒంగోలు: జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని అనుబంధ కాలేజీల్లో ఉత్తమ ప్రతిభ, పనితీరు కనబరిచిన కాలేజీల్లో స్థానిక క్విస్ కాలేజీకి ప్రథమ స్థానం లభించింది. కాకినాడ జేఎన్‌టీయూ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వైవీ హనుమంతరావు, క్వాలిటీ డీన్ ప్రొఫెసర్ ప్రశాంత్‌లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహన్ రావు వద్ద నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా క్విస్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.గాయత్రి మంగళవారం మాట్లాడుతూ 1998లో తమ కాలేజీ ప్రారంభం అయినప్పటి నుంచి ఎంతోమంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ప్రపంచంలోని అనేక దేశాల్లో స్థిరపడ్డారన్నారు. ఉత్తమమైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, న్యాక్ ఏప్లస్, ఎన్‌బీఏ గుర్తింపు కలిగి ఉన్నతమైన ప్రమాణాలు అనుసరిస్తున్నామని, ఈ నేపథ్యంలో తమ కాలేజీకి దక్కిన అవార్డు పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

విదేశీ విష సంస్కృతితో పెరిగిన లైంగికదాడులు



మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

ఒంగోలు టౌన్: విదేశాల నుంచి దిగుమతి అవుతున్న విష సంస్కృతి వల్లనే మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. మంగళవారం ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో జరిగిన ఐద్వా నగర కమిటీ సమావేశంలో ప్రసంగించారు. ప్రపంచీకరణ విధానలు మహిళలపై ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయన్నారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడంలో భాగంగా ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యల పట్ల మహిళలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల గోవిందమ్మ, గంగవరపు ఆదిలక్ష్మి, నగర నాయకురాలు కె. రాజేశ్వరి, గంధవళ్ల కల్యాణి పాల్గొన్నారు.

కంది పంటపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని జమ్మిదోర్నాలలో మంగళవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొని కంది పంటలో విత్తనశుద్ధి గురించి రైతులకు వివరించారు. కిలో కంది విత్తనాలకు 10 గ్రాముల ట్రయకోడర్మావిరిడేతో విత్తనశుద్ధి చేసుకుని విత్తనాలను పొలంలో నాటుకోవాలని సూచించారు. దీంతో విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లను, ఉప్పలం తెగులు రాకుండా ఉంటుందని, రైతులు తప్పని సరిగా ఈ పద్ధతిని పాటించాలని సూచించారు. వీఏఏఎం రాజేంద్ర ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఇ- పంట నమోదు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుజన్ కుమార్, ఏఓ రమేష్‌బాబు

మద్దిపాడు: రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలను ఇ- పంటలో నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ సుజన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏలకు వీఆర్‌ఓలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ప్రస్తుతం ఉన్న జామాయిల్, ఉద్యానవన పంటలు, కూరగాయలు, మేత పంటలను వీఆర్‌ఓ, వీఏఏల ద్వారా ఇ- పంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు. దీని వలన ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. ఏఓ రమేష్ మాట్లాడుతూ కౌలు రైతులంతా తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను సబ్సిడీపై పొందవచ్చని తెలిపారు.

మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కేవీ పిచ్చయ్య

ముండ్లమూరు: మహిళా డాక్టర్లకు దేశంలో రక్షణ లేకుండా పోతోందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. మండలంలోని పోలవరం వద్ద వేదా ఫార్మసీ కళాశాలలో మంగళవారం డీవైఎఫ్ఐ-ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా డాక్టర్లకి రక్షణ కల్పించాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యంత పాశవికంగా హత్యాచారం జరగడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకొచ్చి మహిళా డాక్టర్లకు అండగా నిలవాలన్నారు. డాక్టర్లకు రక్షణ కల్పించేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్, సీఐటీయూ నాయకుడు బి.హనుమంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికంగా సాగు చేస్తే నష్టం



మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్

ఒంగోలు సెంట్రల్: ఈ ఏడాది ప్రారంభం నుంచే పొగాకు అధిక ధరలు పలకడం రైతులకు ఆనందాన్ని ఇచ్చిందని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ అన్నారు. ఒంగోలు-2 పొగాకు బోర్డును మంగళవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్-సప్లై ప్రకారం పొగాకు రేట్లు ఉంటాయన్నారు. అయితే రానున్న సీజన్‌లో అనుమతి మేరకు మాత్రమే పొగాకు పండించాలని కోరారు. ఎప్పటికప్పుడు బోర్డు సూచనలు పాటిస్తూ నాణ్యమైన పంట పండించి మంచి లాభాలు పొందాలని కోరారు. వేలం నిర్వహణాధికారి ఎం. సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు బోర్డు అనుమతించిన విస్తీర్ణం, పరిమాణంలోనే పంట సాగు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గడంతో వీలైనంత వరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. బోర్డు సభ్యులు పోడ వర ప్రసాద్, బోడ పాటి బ్రహ్మయ్య, రైతు నాయకులు సునీల్, వై. వెంకట శేషయ్య పాల్గొన్నారు.

హెచ్ఐవీ రహిత సమాజమే ధ్యేయం

- కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచాలి
- కొరిశపాడు ఎస్సై సురేష్ వెల్లడి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

నాగులుప్పలపాడు: హెచ్ఐవీ, ఎయిడ్స్ సంక్రమించకుండా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొరిశపాడు ఎస్సై వై.సురేష్ పేర్కొన్నారు. స్థానిక నాగులుప్పలపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వంతో పాటు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కూడా కృషి చేయడం అభినందనీయమన్నారు. సంస్థ మేదరమిట్ల టీఐ ప్రాజెక్టు ప్రతినిధి బీవీ సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన మండలితో పాటు తాము కూడా విరివిగా ప్రచారాన్ని చేపట్టామన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి 8 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌కే లాలీ సాహెబ్, ఎస్. శ్రీనివాసరావు, ఈదుమూడి ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

దోమల నివారణతో ఆరోగ్య సమాజం



మద్దిపాడు: సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది



రూరల్: సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న డాక్టర్ వాణి

మద్దిపాడు: దోమల రహిత సమాజం కోసం పాటు పడదామని ఆస్పత్రి డాక్టర్‌లు ఆనందమోహన్, శ్రావణ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆడ ఎనాఫిలిస్ దోమవలన మలేరియా వ్యాధి వస్తుందని 1897 ఆగస్టు 20వ తేదీన సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్నారని తెలిపారు. ఆయనను గుర్తు చేసుకోవడం కోసం ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముందుగా రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ చైతన్య, సీహెచ్ఓ లలితమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, సీతమ్మ, స్టాఫ్ నర్సు రాణి ఫార్మసిస్ట్ శాంతిశ్రీ, పీహెచ్‌సీ సిబ్బంది వరలక్ష్మి, సుస్మిత, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్: కరవదిలో ప్రపంచ మలేరియా దినం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వాణి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా కారక పరాన్నాజీవులను ఆయన కనుగొన్నారని.. మలేరియాను శరీరంలో గుర్తించారన్నారు. కృష్ణా రెడ్డి, మాధవి, శ్రీధర్, భార్గవ్, మహేందర్, విక్టోరియా, భానుమతి, జ్యోతి పాల్గొన్నారు.

కళాశాలలో ఆర్ట్ ఎగ్జిబిషన్

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రగతి ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్ క్యాంప్, ఎగ్జిబిషన్ నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన చిత్రకారులు వేసిన చిత్రాలను ప్రదర్శనకు ఉంచగా విద్యార్థులు తిలకించారు. కళాశాల ప్రహరీపై జాతీయ నాయకుల చిత్రాలు వేశారు. అనంతరం కళాకారులను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ఆర్ఐఓ సైమన్ విక్టర్, పీడీ మురళి, చిత్రకారులు ఖాసిం, రాజు, కోటి పాల్గొన్నారు.